# పేగుబంధం



## బోధనం నర్సిరెడ్డి

'ఏమే పోరీ ఒస్తావ్
గాసార్ది చిత్తు బోశేదుండి"
"ఓమ్మో నీన్రానయ్య
లింగచారి మేస్త్రిది లెంటల్‌బో
య్యాలె. ఆయినూకోడు."
"ఆని కల్యాటైనవా ఏందే?"
ఇయ్యాల్టికి పదిరోజుల్నించి ఆ
నెంటనే బోతున్నవ్!"

"ఏయ్ ఎట్నో మాట్లాడ్తవ్ వుప్పరోడ! చేతుల టిపిని జూడెట్టుందో!"

నవ్వుకుంట బెదిరిచ్చింది మేస్త్రిని ఓ కూలిపిల్ల. ఎండ కాలమాయె ఎనిమిదిన్నర గాకముందే శాంబ్రం గురిసినట్టు ఎండెక్కొస్తున్నది. మొకాల కేసుకున్న పోడరు మీదినించి చెమటదారలు గడ్తుంటే పైటకొంగుదీశి తుడుసుకుంటున్నరు కొందరు వడ్డ పోరలు. అట్లాంటోల్లతోని ఆశ్కాలాడుతున్నరు మేస్త్రీలు.

రామగిరి గాంధిపార్కు కాడ గుడిగోడెమ్మట ఓ పక్క కాయగూరల దుకాణాలు. ఆపక్కనే చేపల అడ్డ. గాంధిబొమ్మసుట్టూ కూలికోసమొచ్చిన కూలీలు, ఆళ్ళకోసమొచ్చిన మేస్త్రీలు. కూరగాయల కోసం చేపల కోసమొచ్చిన జనాలు. పొద్దున్నే రద్దిరద్దిగున్నది చౌరస్తా.

కొర్రమేను చేపలు బేరం చేస్తున్న దామోదర్‌రెడ్డి తలకాయెత్తి కూలి జనంల కలజూశిండు. బీటు మార్కెట్ల ధాన్యం రాసులు బోశినట్టు రాసులురాసులు గూకున్నరు కూలిజనం. కాలాల్లేక సుట్టుపక్కల ఊల్లల్లనించి వలసొచ్చినోళ్ళు, రోజూ టాక్టర్లమీదా బస్సులూ సైకిళ్ళ మీదా, నడిశీ వచ్చిపోతోళ్ళు గుట్టలు గుట్టలు, కుప్పలు కుప్పలు గూకున్నరు జనం.

పైమీదికంగిలేక కండువ గుడ్డలు గప్పుకున్నోళ్ళు, గోశికి దోతిపేల్కెలేక చినిగిన లుంగిగుడ్డను గోశి బెట్నోళ్ళు చేతుల్ల టిపిని గిన్నెలు బట్కోని ఒళ్ళు కూలికి బిలుస్తరో ఆ దినమెల్లది ఎదురుచూస్తున్నరు.

"ఏం పంతులూ బాగున్నవా? శాన్నాళ్ళగ్గన్పడితివీ?"

గొంతు ఇన్నట్టే ఉందిగని, మనిషిని జప్పున పోల్చుకోలేకపోయిండు దామోదర్‌రెడ్డి. తెల్లగ నెర్శిన గడ్డం జరంత పెరిగున్నది. నోట్లెగాల్తున్న పొరసుట్టను నేలకు రాశి సల్లార్పి, రుమాల్ల దోపుకోని కూలోల్లతోటి మాట్లాడితోడు జరపక్కకొచ్చిండు రాంరెడ్డి. మనిషి బాగ దశిలిపొయ్యున్నడు. చెయ్యెత్తు మనిషాయె కొద్దిగ ఒంగిండు.

"ఒల్లు రాంరెడ్డి సాబా! నీంబానే ఉన్నగని ఏందే నువ్వీడున్నవ్?"

ఆయన ఇన్ని రోజులకగవడితాలకు కడుపునిండ బల్కరిచ్చిండుదామోదర్‌రెడ్డి.

"ఏందే మొత్తం దిగిపొయినవ్ మనిషివీ! కొడుకేడుంటున్నడు? ఏంజేస్తున్నడు? అంత నిమ్మలమేనా?" అడిగిండు.

"ఏం నిమ్మలం పంతులూ! ఇగో గిట్ల కూలికొచ్చిన! సూస్తనే ఉంటివి."

దామోదర్‌రెడ్డి కొక్కపాలే గరగ్గుమన్నది. ఎసోంటి మనిషెట్టయ్యిండని మతిల దేవులాడబట్టిండు.

"నువ్ కూలికొచ్చుడేందే! ఎచ్చిడికంటున్నవా?" నమ్మలేక అడిగిండు.

"నీతోని నాకెచ్చిడేంది పంతులూ; నిజంగనే అంటున్నగని నువ్వేడజెప్తున్నవిప్పుడు?"

"నేను గీ సందెనపెల్లినే జెప్తున్నగని నువ్వేంది పెద్దమనిషివి కూలికొచ్చిన్నంటవ్! గీద చా దాక్కుంట మాట్లాడుకుందాంపా!"

దామోదర్రెడ్డెన్క రాంరెడ్డిఇద్దరూ పక్కనున్న రాజస్తాన్ టీస్టాలుకి బొయ్యి బెంచి మీద గూకున్నరు.

"ఏయ్ బాబూ దో గులాబీ బనావ్!" చాయ్‌కి ఆర్డరిచ్చిండు దామోదర్‌రెడ్డి. చాయ్ పోరడు రొండు చాయ్‌లు దెచ్చి చెరోటి అందిచ్చిండు.

రాంరెడ్డిని జూశిన కాన్నించి దామోదర్‌రెడ్డి మతి కలదప్పింది. ఊరికి సర్పంచైనోడిట్ల ఊళ్ళుబట్టి తిరగడానికి తానే జిమ్మెదారనుకున్నడు.

** ** **

నార్కెట్‌పల్లి హైవేమీద ఓ.సి.టి.ఎల్ కంపిని బడ్డప్పుడు తను లింగోట యు.పి.ఎస్.ల హెడ్మాస్టరుగ పనిజేస్తుండె. అప్పుడు ఊరికి సర్పంచ్ రామిరెడ్డితోటి బాగ నెలువైంది. జెండా వందనమొచ్చినప్పుడు, ఏదన్న సర్వేపనిబడ్డప్పుడు ఊల్లెకు బొయ్యి సర్పంచును గల్మెటోడు పంతులు. తనకు మంచీచెడ్డా పనిబడ్డా బడకపొయినా రోజోపాలి బడికల్లబొయ్యి సంగతులర్సుకునెటోడు సర్పంచి. కక్కయ్యా? చిన్నాయ్యాని ఒర్సబెట్టి పిల్చెటోడు పంతులు. అట్లా ఒకనాడొచ్చి పంతుల్ని గలిశిండు సర్పంచి.

"నమస్తే సర్పంచ్ సాబ్! బాగేనా? ఏమో పొద్దు గాలొస్తుంద్రు బడిదిక్కు."

నవ్వుకుంట బల్కరిచ్చిండు పంతులు.

"నమస్తే పంతులూ! తమదయవల్ల బానే ఉన్నంగని మజ్జానం అన్నాల్దిన్నంక ఓపాలి ఇంటికొచ్చి పోవైతివి! జరంత పనిబడ్డది" అడిగిండు సర్పంచి.

"మజ్జానమేంది చెప్పరాదిప్పుడే సంగతేందో! ఒల్లుంద్రీడ!" తొందర పెట్టినట్లన్నడు.

"అహా! అట్లగాదుగని జరో ముచ్చటడిగేదుంది పుర్సతుగ మాట్లాడాలె! గందుకని ఇంటికి రమ్మంటున్న"

"సరైతె నేనే ఊల్లెకొద్దామనుకుంటున్న నేత పనివాళ్ళ సర్వే డూటి పడ్డదోటి"

కాయితాలు బట్టుకొని లేశిండు పంతులు. ఇద్దరు ఊల్లెకు బాటబట్టింద్రు.

"ఎన్ని మగ్గాలున్నయే ఊల్లె? సాలోల్లేనా అంత! లేకపోతె ఇంకోళ్ళన్ని నేస్తరా బట్టలు!"

"నాలుగైదు మాలిండ్లుండెగా! పంతులూ! ఆళ్ళుగూడ నేస్తరుగని మగ్గాలు మూలకుబెట్టి కాల్వకిందికి కూళ్ళకు బొయింద్రు ముండాకొడుకులు. ఒళ్ళు దొరుకుతరు నీకిప్పుడు?"

రామగిరి గాంధిపార్కు
కాడ గుడిగోడెమ్మట ఓ పక్క
కాయగూరల దుకాణాలు. ఆపక్క
నే చేపల అడ్డ. గాంధిబొమ్మసు
ట్టూ కూలికోసమొచ్చిన కూలీలు,
ఆళ్ళ కోసమొచ్చిన మేస్త్రీలు.
కూరగాయల కోసం చేపల
కోసమొచ్చిన జనాలు.

"ఏదో నాతిప్పలు నీను బడ్తగని! నువ్వొచ్చిన పనిచెప్పరాదిగ"

సర్పంచిల్లు బడికి దగ్గరే. ఇద్దరు మాట్లాడుకుంటుండంగనే ఇల్లొచ్చింది. బంకుల్ల బల్లెపేటమీద పంతుల్ని గూసోమని లోపలికి బొయ్యిండు సర్పంచి. పందిట్ల మంచంల సర్పంచి తండ్రి బండుకోనుండు. కొట్టంల రాతిమొగరాలకు రొండు బండెడ్ల గట్టేశి మెలేశింద్రు. మిగతా రొండుజతల ఎడ్లమెడల మీద కాండ్లు బెట్టి బేరదార్లు ముడేస్తుంద్రు జీతగాండ్లు.

కింద రొండు ఔజ్జానల గుంటుకలున్నయ్. ఒక్కొక్క దానికి రొండేశి జానెడు జానెడు పొట్టిగుంటుక పలుగులున్నయ్. కొట్టంల మూలకు గోడ కానిచ్చి ఒక మూడుసాల్ల ఇనుప నాగలున్నది. దాన్ని బండెడ్లె తేనేగని పీకతరమైద్ది.

జీతగాండ్లిద్దరూ గుంటుక మేడితోకల్ని తిరిగేశికొట్టి ఎడ్లమెడల మీద గుంటుకల్ని కొడార్లేశి యారగట్టల్ని పట్టుసోగలకు దగిలిచ్చి గేట్లనించి అరకల్ని బయిటికల్గిస్తున్నరు.

"ఆ ఇగబటు పంతులూ! జరన్ని పాలు దాగుపటు" గిలాసం దిచ్చిండు.

"ఏందిరా ఇంకా ఈన్నే ఉంద్రు. అమ్మటాల్లయితుంటె! ఆనపొద్దేల్ల పొద్దుగాల్ల గట్టి పొద్దుగాల్లిడువక"

జీతగాల్ల తానికి బొయ్యిండు సర్పంచి.

"ఒక్కవల్లు గుంటకలన్నెయ్యికపొయిన్రు! చెట్లు బాగ బెరిగిన్నె ఇరిగిపోతయో ఏమో! జెర పెద్ద చెట్లొచ్చినకాద చెయ్యి వ్కనన్న బట్రిపైకి! మల్లసాలుకు ఒక్క పలుగడ్డల్నే ఏద్దురుగని"

జీతగాండ్లకు జాగర్త జెప్పి అరకల్ని సాగనంపిండు.

"పంతులూ! మన రోడ్డుకాడేదో కంపిని బడ్తున్నదిగద! ఆడ మాకో పదెకరాలకిత్తుంది. గండ్లనే నాలుగెకరాల మిరిపిత్తులెదబెట్న. మొకాళ్ళదాక బెరిగిన్నె చెట్లు. గిప్పుడు గుంటుకలు గండ్లకే బోతున్నయ్"

మల్ల ఇంట్లకొచ్చి వివరంగ జెప్పిండు రాంరెడ్డి.

"మొన్న గీభూమినే గొంటమని ఇద్దరాంద్రోళ్ళు కారేస్కొనొచ్చిన్రు. ఎకురం పద్దను కడిగింద్రు. బయానదీశి చేతుల్నే బెట్టబొయిన్రు గని నేనే జెర ఇశారించుకోని చెప్తనని ఎల్లగొట్న. మల్ల రేపొస్త

